## మెట్రోను శంషాబాద్‌కు పొడిగించాలి



కేంద్ర మంత్రికి వినతి పత్రమిస్తున్న మహేందర్

శంషాబాద్: మెట్రో రైల్ ప్రాజెక్టును శంషాబాద్ వరకు పొడిగించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతి పత్రం సమర్పించారు. అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా శంషాబాద్ (ఉందానగర్) రైల్వే స్టేషన్‌లో ఆపాలని కోరారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో స్టాప్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

## ఫ్లైఓవర్‌కు వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలి: బీజేపీ



బీజేపీ నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

శంషాబాద్: అరాంఘర్ ఫ్లైఓవర్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలని బీజేపీ నేతలు పట్టణంలో ఆందోళనకు దిగారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు. సీఎం డౌన్ డౌన్ అంటు నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అతిగా వ్యవహిరిస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం



శంషాబాద్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన కేంద్రంపై శంషాబాద్ ఎస్‌ఓటీ అధికారులు దాడులు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని ఓ గోదాములో ఉన్న 13 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: మెరుగైన వైద్యం కోసం పేదలకు సీఎం సహాయ నిధి ఓ వరంగా ఆదుకుంటోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌కు చెందిన కె.అనంత రాములుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 60 వేలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును ఆయన సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేదలు దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక నేత గోకరి సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచరుల అరెస్ట్

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచరులను గచ్చిబౌలి పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరికాలనీలోని సిల్వక్ కి ఓయో హోటల్, ఫ్రీ హోటల్‌లో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులు బసచేసినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దాదాపు 35 మందిని అరెస్ట్ చేశారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి వివరాలు సేకరించి వదిలిపెట్టారు.

# గ్రేటర్‌లో కలిస్తే.. అభివృద్ధి జరిగేనా?

- ఈ నెల 26న ముగియనున్న మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం
- విలీనంతో తగ్గనున్న ప్రజా ప్రతినిధుల సంఖ్య
- అభివృద్ధిపై సర్వత్రా అనుమానాలు
- ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోని శివారు కాలనీలు

బండ్లగూడ: శివారు ప్రాంతాల్లోని కార్పొరేషన్లు, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం కానున్నాయి. ప్రస్తుతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం ఈ నెల 26న ముగియనుంది. వాటిని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియకు కార్యరూపం దాల్చనుంది.

– గ్రేటర్ శివారు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయనుంది. జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలకమండలి పదవీకాలం వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ముగియనుంది. ఆలోగా ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది.

### ఐదు గ్రామ పంచాయతీలు విలీనం చేసి...

గతంలో గ్రామ పంచాయతీల పదవీ కాలం పూర్తయిన తరువాత బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, పీరంచెరువు ఈ గ్రామ పంచాయతీలను 2019 జూలైలో విలీనం చేసి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 డివిజన్‌లకు కార్పొరేటర్లుగా ఎన్నికైన వారు ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.

### అభివృద్ధి జరుగుతున్న తరుణంలో...

ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుంటున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మంచి నీరు, రహదారులు, మురుగునీటి వ్యవస్థ, పార్కులు ఏర్పాటు తదితర అభివృద్ధి మెరుగు పడుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడంతో ప్రజలకు ప్రజాప్రతినిధులకు దూరం పెరిగి అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

### జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే...

కార్పొరేషన్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే ఓటర్ల సంఖ్య ఆధారంగా నాలుగు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ డివిజన్‌లుగా మారేందుకు అవకాశం ఉంటుంది. ఇటీవల చేసిన కులగణన చేపట్టిన విషయం తెలిసిందే. డాటా ఎంట్రీ కూడా దాదాపు పూర్తయ్యింది. రిజర్వేషన్లు కూడా త్వరలో కొలికి రానున్నవని సమాచారం.



ప్రారంభానికి నోచుకోని మున్సిపల్ కార్పొరేషన్ భవనం

### కార్పొరేషన్‌లో అభివృద్ధికి నోచుకోని కాలనీలు...

కార్పొరేషన్ పరిధిలో కొన్ని కాలనీలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. కార్పొరేషన్‌లోని సాధారణ నిధులతో కొద్ది మేర మాత్రమే పనులు చేపట్టారు. దీంతో ఉన్న మట్టి రోడ్లు ఛిద్రమయ్యాయి. చిన్నపాటి వర్షం పడ్డా రోడ్డుపై నడిచే పరిస్థితి లేకుండా పోయింది.

విఘ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, పీరంచెరువు ఓల్డ్ విలేజ్, శివసాయినగర్ కాలనీ, సుబ్రహ్మణ్య కాలనీ, దత్తాత్రేయనగర్ కాలనీ, హిమగిరినగర్ కాలనీ, యాదాద్రి కాలనీ, ఫైన్‌ఆర్ట్స్ కాలనీ, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ తదితర కాలనీలు ఉన్నాయి. జీహెచ్‌ఎంసీలో విలీనం తరువాత ఈ కాలనీలకు మోక్షం కలుగుతోందో లేదో వేచి చూడాల్సిందే.

### ఓటర్ల సంఖ్య 87,202.. 1.60 లక్షల జనాభా..

బండ్లగూడ జాగీర్‌లో ప్రస్తుతం 1.60 లక్షల జనాభా ఉన్నట్టుగా అంచనా. 35,722 నివాస గృహాలు ఉండగా 200లకుపైగా కాలనీలు ఏర్పడ్డాయి. ఓటర్లు 87,202 మంది ఉన్నారు. అందులో పురుషులు 44,742 మంది ఉండగా మహిళా ఓటర్లు 42,456 కాగా ఇతరులు 4 ఉన్నారు.

### ప్రారంభానికి నోచుకోని కార్పొరేషన్ కార్యాలయ భవనం...

రూ. 12 కోట్ల నిధులతో చేపట్టిన నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి సంవత్సరం గడుస్తున్నా నాయకుల మధ్య సమన్వయ లోపంతో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం హిమాయత్‌సాగర్ మంచినీటి విషయంపై సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్ మధ్య వాట్సాప్ గ్రూప్‌లలో వేర్వేరుగా విరుద్ధ ప్రకటనలు పోస్టులు పెడుతూ విమర్శలకు దిగుతున్నారు.



ప్రస్తుతం పాలన కొనసాగుస్తున్న కార్పొరేషన్ కార్యాలయం

## 'ప్రజావాణి'లో రెండు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప కమిషనర్ రవికుమార్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. వీధి దీపాలు, రోడ్డు ఏర్పాటు కోసం ఫిర్యాదులు చేశారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యను పరిష్కరించాలని డీసీ సూచించారు.

## కొత్త ఫ్లై ఓవర్‌కు మన్మోహన్‌సింగ్ పేరు భేష్



బొక్క ప్రభాకర్‌రెడ్డి

రాజేంద్రనగర్: జూపార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు కొత్తగా నిర్మించిన ఫ్లై ఓవర్‌ను మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును పెట్టడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నగరం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులను చేరవేసేందుకు గతంలో సరోజినీ దేవి ఆస్పత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు ఫ్లై ఓవర్‌ను నిర్మించారన్నారు. ఇది ఏషియాలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ అని తెలిపారు. దీనికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పెట్టారని.. ప్రస్తుతం జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు 4.20 కిలోమీటర్ల మేర నిర్మించిన ఫ్లై ఓవర్‌కు మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు



పోలీసులు అరెస్టు చేసిన బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా సోమవారం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరాంఘర్ వద్ద ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ఫ్లై ఓవర్‌కు మజ్లిస్ పార్టీ బ్యానర్లు, జెండాలను కట్టడాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకించారు. ఇదే విషయమై ప్రారంభోత్సవ సమయానికి బీజేపీ నాయకులు ఆరాంఘర్ వద్ద ఆందోళన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సమాచారం అందించి ధర్నా కార్యక్రమానికి ఆదేశించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీసులు ముందస్తు జాగ్రత్తగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఉదయం నుంచే అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# నిషేధిత చైనా మాంజాను అడ్డుకుందాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీ రవికుమార్ తదితరులు

అత్తాపూర్: మానవ, పశుపక్షాదుల పాలిట ఉరితాడుగా మారిన సింథటిక్ సైలాన్ చైనా మాంజా నిషేధం అమలులో జన చైతన్య కోసం పౌర సంఘాలు కదులుతున్నాయి. చైనా మంజా నిషేధం అమలు కోసం రాష్ట్ర అటవీ శాఖ చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా నిలవాలని, నిషేధిత మాంజా అమ్మకాలను అడ్డుకోవాలని అత్తాపూర్ కాలనీ సంఘాలు, చింతకుంట పార్క్ వాకర్లు, ప్రణవ భక్త సమాజం పిలుపునిచ్చాయి. సోమవారం చింతకుంట పార్కులో ఏర్పాటైన జన చైతన్య కార్యక్రమానికి రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింథటిక్ సైలాన్ గ్లాస్ కోటెడ్ మాంజాపై అటవీ శాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజా నిషేధం అమలుకు పౌర సంఘాలు ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు మ్యాడం మధుసూదన్, నారగూడెం మల్లారెడ్డి, మోంద్ర కొమురయ్య, జె.జగన్‌మోహన్‌రెడ్డి, నల్లింగ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యోగ సంఘం కేలండర్ ఆవిష్కరణ



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను వీసీ డాక్టర్ జానయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీకి ఉద్యోగ సంఘాల నాయకులు పలు సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. ఉన్నతాధికారుల నియామకాల్లో సమర్థత, ప్రతిభ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం కల్పించాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది అంశాల్లోనూ సానుకులంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రజనీకాంత్, ఉపేందర్, చైతన్య, సతీష్, ప్రశాంత్, మహాశ్వర్, కుమారస్వామి, భిక్షపతి, రమేష్, కృష్ణ, సంతోష్, కవిత, సురేఖ, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నాలాల విస్తరణ ఆర్‌సీసీ బాక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. కొండాపూర్ డివిజన్‌లోని గఫూర్‌నగర్ కాలనీ నుంచి దుర్గంచెరువు వరకు, సైబర్ హిల్స్ నుంచి వయా జనార్దన్ హిల్స్ యూరోకిడ్స్ స్కూల్ వరకు రూ.25.41 కోట్లతో చేపట్టే పనులపై ఎస్ఎన్‌డీపీ విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో వరద సమస్య పునరావృత్తం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుని నాలా విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ వశీధర్, ఏఈ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... దుర్గానగర్ బస్టాండ్ ప్రాంతంలో అనారోగ్యంతో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు సమాచారం అందింది. సదరు వ్యక్తి 55–60 సంవత్సరాల మధ్య ఉండి స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ



రాజేంద్రనగర్: పీఆర్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస సాగర్‌ల సమక్షంలో ఆవిష్కరించారు. మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులు సత్యన్న, సుధాకర్, సురేశ్, అల్లావలి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంజన్న, ఖాజావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సత్వరమే పూర్తి చేయాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివజిన్ రెడ్డినగర్‌లో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలని, అదే విధంగా పలు చోట్ల పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, స్థానిక నేతలు రమేష్‌రెడ్డి, సంతోష్, కిషన్‌నాయక్, రమణ, గోపాల్‌నాయక్, చందు, శంకర్, తలారి చిన్న, శంకర్‌రెడ్డి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# 'మార్కెట్ భూమిని తిరిగి ఇచ్చేయండి'



మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తామే నిర్మించుకుంటాం
- నార్సింగి మార్కెట్ కమిటీ తీర్మానం
- పలు అభివృద్ధి పనులకు ఆమోదం

మణికొండ: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామని పురపాలక సంఘం తీసుకున్న రెండు ఎకరాల భూమిని తిరిగి మార్కెట్ కమిటీకి స్వాధీనం చేయాలని నార్సింగి మార్కెట్ కమిటీ పాలక కమిటీ తీర్మానం చేసింది. సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ ఆధ్వర్యంలో నార్సింగి మార్కెట్ కమిటీ పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నుంచి మున్సిపాలిటీ వారు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించి ప్రజలకు అన్ని రకాల కూరగాయలు, మాంసకృత్తులు, చేపలు ఒకే చోట లభించేలా నిర్మిస్తామని భూమి తీసుకున్నారు. దాన్ని కేవలం పుట్టింగ్‌ల వరకు నిర్మాణం చేసి గాలికి వదిలేయటంతో ప్రమాదభరితంగా మారిందన్నారు. నిర్మాణాల కోసం తీసిన గుంతలలో చిన్నారులు పడే ప్రమాదం లేకపోలేదన్నారు. సదరు భూమిని తిరిగి మార్కెట్ కమిటీకి అప్పగిస్తే తమ ఆధీనంలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. మార్కెట్‌లో ఉన్న పశువుల షెడ్‌లకు అద్దెలను నిర్ణయించాలని, మార్కెట్‌కు వచ్చే రైతులకు ఉపయోగపడేలా టాయిలెట్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంతోపాటు ఆవరణలో మంచి నీటి కనెక్షన్‌లు తీసుకోవాలని తీర్మానం చేశారు. రాబోయే రోజుల్లో మార్కెట్ కమిటీకి ఆదాయాన్ని పెంచటంతో పాటు రుణాలు, ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను రాబట్టి అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని సభ్యులు కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ యాదవ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, డైరెక్టర్లు ధర్మపురి, బాల్‌రెడ్డి, రాజు, లక్ష్మీశ్రీ, మల్లేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మణికొండ: ఎన్నికల కంటే ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు కామారెడ్డి కేంద్రంగా విడుదల చేసిన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లో బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన, బీసీ కమిషన్ నివేదికల ఆధారంగా రిజర్వేషన్లను పెంచుతామని అన్నారని గుర్తు చేశారు. స్థానిక సంస్థలలో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ నిర్మాణ రంగం, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు తగినన్ని నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధ హోదాతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఆ విషయాన్ని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమానికి ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లు, ఐదు సంవత్సరాల్లో రూ. లక్ష కోట్లు కేటాయిస్తామన్నారని తెలిపారు. బీసీ యువత చిరు వ్యాపారాలు, ఉత్తన విద్య కోసం రూ. 10 లక్షలు ఎలాంటి పూచీకత్తు, వడ్డీ లేని రుణాలను ఇస్తామన్నారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శివరాజ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో ప్రజావాణి



శేరిలింగంపల్లి సర్కిల్ ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి, అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 11 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ 2, శానిటేషన్, ఎంటమాలజీ విభాగాలకు ఒక్కొక్క చొప్పున దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్ కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.